క్లుప్తంగా

డెంగీపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దొరవారిసత్రం : స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో శుక్రవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా డెంగీ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు కీటక జనిత వ్యాధులపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వైద్య సిబ్బంది కిరణ్, శ్రావణి, డోరతి, సుధార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా

కలువాయి: మండలం కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం పాఠ్య, నోటు పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ షేక్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలు చదివి అర్థం చేసుకుంటే ఇంటర్‌లోనే కాదు, ఐఐటీ, నీట్ తదితర పరీక్షల్లోనూ మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం తమ కళాశాలలో ఇంటర్ చదివి అమరావతిలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈలో సీటు సాధించిన విద్యార్థిని జ్యోత్స్నవిని అభినందిచారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్ : రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని పెట్లూరులో శుక్రవారం ఆత్మ సహకారంతో భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అవసరానికి తగినట్టు ఎరువులు వాడడం వల్ల ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. అంతేగాక నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. ఏడీఏ నాగార్జున సాగర్ మాట్లాడుతూ భూముల్లో సారం పెంచేందుకు వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, సుజాత, వీఏఏ వరలక్ష్మి పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు మరువలేము



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

గూడూరు రూరల్ : అమర వీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1999లో కార్గిల్ యుద్ధంలో 527 మంది భారతీయులు అమరులయ్యారని తెలిపారు. అనంతరం వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మన్నూరు మల్లికార్జున్, శివశంకర్, డాక్టర్ మహేష్, కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం శ్రీనివాసన్ సేవా సంస్థ, తిరుపతి ఎస్వీ అరవింద్ కంటి వైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు రవితేజ, కృష్ణవంశీ, జీవన్‌రావు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసన్ సేవాసంస్థ వీడీవోలు కేశవులు, అలేఖ్య, పార్థు, సురేష్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దందా

ఎన్నికల ముందు వరకు ఇసుక సులభంగా దొరికేది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక అందడం లేదు. దీంతో డిమాండ్ బాగా పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది అక్రమార్కులు దందాకు పాల్పడుతున్నారు. వారికి అధికారులు సహకరిస్తుండడంతో రేయింబవళ్లు ట్రాక్టర్లతో స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ఇసుక తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– పెళ్లకూరు

- పోలీసుల కనుసన్నల్లోనే అక్రమాలు
- చోద్యం చూస్తున్న జిల్లా యంత్రాంగం



కలవకూరు వద్ద స్వర్ణముఖినదిలో ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేస్తున్న కూలీలు

పెళ్లకూరు మండలం గుండా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది రైతులకు కల్పతరువు వంటిది. నది నీటితో సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 20 గ్రామాలకు మంచి పథకాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. నదికి ఇరువైపులా వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఏర్పాటుచేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. ఏడాదికి ఒకసారి నది ప్రవహిస్తే సుమారు రెండేళ్ల వరకు నీటికి సమస్య ఉండదు. రెండు పంటలు పండించుకోవచ్చు. ఈ క్రమంలో ఇసుకకు డిమాండ్ పెరగడం నదికి శాపంగా మారింది. తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, పుల్లూరు, చింతపూడి, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది నుంచి రేయింబవళ్లు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. అధికార పార్టీ కార్యకర్తలు, ట్రాక్టర్ యజమానులు ఇక్కడి నుంచి శ్రీసిటీ, తడ, శ్రీకాళహస్తి, నాయుడుపేట, వెంకటగిరి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వారికి స్థానిక పోలీసు అధికారులు సహకరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వారు ఇసుక వ్యాపారులతో ఫోన్‌లో బహిరంగంగా మాట్లాడుతూ రోజువారి మామూళ్లు వసూలు చేయడం దినచర్యగా చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మామూళ్లు చెల్లించని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం, క్రమం తప్పకుండా మామూళ్లు ఇచ్చే వ్యాపారులతో సఖ్యతగా ఉంటూ జేబులు నింపుకోవడం రివాజుగా మారినట్టు సమాచారం.

పాడి రైతులనూ వదలని వైనం

అదేవిధంగా శుక్రవారం వచ్చిందంటే వారికి పండగేనని స్థానికులు చెవులు కొరుక్కుంటున్నారు. గూడూరు సమీపంలో ప్రతి శుక్రవారమూ పశువుల సంత జరుగుతుంది. దూరప్రాంతాలకు చెందిన పాడి రైతులు మేకలు, గొర్రెలు తదితర మూగజీవాలను కొనుగోలు చేసి వాహనాల్లో తీసుకెళుతుంటారు. పెళ్లకూరు మండలానికి చెందిన పోలీసులు నాయుడుపేట గోమతి సర్కిల్ నుంచి నెలబల్లి క్రాస్ రోడ్డు మధ్యలో పాడి రైతులు, వాహనదారుల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా రాజుపాళెం, రోసనూరు, నందిమాల, చిల్లకూరు, దొడ్లవారిమిట్ట, కలవకూరు, పుల్లూరు గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం బెల్టు షాపులు నడుస్తున్నా నెల మామూళ్లు తీసుకుని పట్టించుకోకుండా వదిలేస్తున్నట్టు సమాచారం. పునబాక గ్రామ సమీపంలో ఉండే ఓ భారీ కలప పరిశ్రమకు సముద్రతీర గ్రామాల నుంచి లారీలు, ట్రాక్టర్లలో జామాయిల్ కలప తరలించే వారి నుంచి కూడా నెల మామూళ్లు వసూలు చేస్తున్నట్టు తెలిసింది.

> **ప్రత్యేక నిఘా పెట్టాం**
>
> స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయి. సెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశాం. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> **– అరుణకుమారి, సెబ్ సీఐ, నాయుడుపేట**



కలవకూరు వద్ద రహస్య ప్రదేశంలో డంప్ చేసిన ఇసుక



పుల్లూరు నుంచి శ్రీకాళహస్తికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



స్వర్ణముఖి నదిలో ఉన్న వ్యవసాయ బోరు

ఉపాధి పనుల్లో అవకతవకలపై గ్రామ సభలు

చిల్లకూరు : మండలంలోని కడివేడు, తిప్పగుంటపాళెం గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కింద చేసిన పనుల్లో అవకతవకలపై శుక్రవారం గ్రామసభలు చేపట్టారు. కూలీలకు నగదు చెల్లింపులు, జాబ్ కార్డులు అందని వారు, ఎక్కడా పనులు చేయకుండానే కొలతలు వేసి నగదు స్వాహా చేశారా తదితర విషయాలపై ఆరా తీశారు. కడివేడులో జరిగిన గ్రామ సభలు 15 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తూనే సమీపంలో ఉన్న పాల పరిశ్రమలో పనులకు వెళుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టగా 15 మంది గ్రామ సభకు హాజరై వారు ఉపాధి పనికి ఉదయం 10 గంటలలోగా వచ్చి తరువాత పాల పరిశ్రమలో 11 గంటల షిఫ్టుకు వెళుతున్నట్టు తెలిపారు. దీనిపై అభ్యంతం ఎందుకని ప్రశ్నించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చేపట్టే సామాజిక ప్రజా సభలో వివరిస్తామని తెలిపారు. కడివేడు ఎంపీటీసీ శైలజ, ఉప సర్పంచ్ మధురెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఆర్‌పీ రవి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కడివేడులో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు రూరల్ : గూడూరులోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈ ఎల్.ప్రసాద్ తెలిపారు. గూడూరుటౌన్, గూడూరు మండలం, చిల్లకూరు మండలాల్లోని అన్ని సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

అమరవీరులకు నివాళులు

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 24వ ఆంధ్రా బెటాలియన్ అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి పెంచల పుల్లయ్య ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. కార్గిల్ పోరులో 527 మంది సైనికులు అమరులయ్యారని తెలిపారు. అనంతరం విద్యార్థులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారి పిల్లలను ఆర్మీలో చేర్పాలని కోరారు.

ఎన్‌బీకేఆర్‌లో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న ఎన్‌బీకేఆర్ విద్యార్థులు

కోట: కార్గిల్ యుద్ధంలో భారతసైన్యం విజయం సాధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీకి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు సాగింది. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు వీరోచితంగా పోరాడి పాకిస్తాన్‌ను ఓడించారని తెలిపారు. ఈ పోరాటంలో 527 మంది సైనికులు అమరులైనట్లు తెలిపారు. సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఆర్మీ, నేవీ, ఎన్‌సీసీ క్యాడెట్లు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ మాధవయ్య, మల్లికార్జున్‌రెడ్డి, శోభారాణి పాల్గొన్నారు.

బైక్ బోల్తాపడి వ్యక్తికి గాయాలు



గాయపడిన వెంకటేష్

దొరవారిసత్రం : పడమటికండ్రిగ గ్రామ సమీపంలో శుక్రవారం బైక్ బోల్తాపడి వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఆనేపూడి గ్రామానికి చెందిన వెంకటేష్ బైక్‌లో సూళ్లూరుపేటకు వెళ్లి పనులు చూసుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. పడమటికండ్రిగ సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను స్థానికులు 108లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోరా హోరీగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని మోమిడి గ్రామంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. ఉదయం మోమిడి, పొన్నవోలు జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేపట్టిన మోమిడి దినేష్ జట్టు 12 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన పొన్నవోలు జట్టు 9 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఆకుతోట, తూర్పుకనుపూరు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేపట్టిన ఆకుతోట జట్టు 12 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుకనుపూరు జట్టు 11.4 ఓవర్లలో 96 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. విజేతగా ఆకుతోట జట్టు నిలిచింది.

కండలేరులో 6.202 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.202 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 140, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం వితరణ



విద్యార్థులకు యూనిఫాం, కుట్టు మిషన్లు అందజేస్తున్న రోటరి క్లబ్ గవర్నర్, ప్రెసిడెంట్లు

నాయుడుపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం నాయుడుపేట రోటరీ క్లబ్ సభ్యులు యూనిఫాం పంపిణీ చేశారు. అలాగే విద్యార్థినులకు శిక్షణ ఇచ్చేందుకు రెండు కుట్టు మిషన్లు అందజేశారు. వాటిని నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన పారిశ్రామికవేత్త పెసల జయరాజగోపాల్ వితరణ చేశారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల రోటరీ క్లబ్ గవర్నర్ సాదు గోపాలకృష్ణ, జిల్లా పరిధిలోని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా తాళ్లమ్మ కొలుపు ప్రారంభం

దక్కిలి: మండలంలోని దగ్గవోలులో వెలసిన తాళ్లమ్మతల్లి కొలుపు కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. గతేడాది అమ్మవారికి నూతనంగా ఆలయం నిర్మించారు. ఈ క్రమంలో రెండో ఏడాది కూడా కొలుపు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. రాత్రి తాళ్లమ్మ, పోతురాజు, పరుశురామయ్యను గ్రామ చావిడి దగ్గర నిలుపుదల చేశారు. అక్కడి నుంచి గొల్లలు వీరతాళ్లతో ఊరేగింపు చేశారు. శనివారం కూడా ఇదే తరహాలో ఊరేగింపు చేపడతామని గ్రామస్తులు తెలిపారు. ఆదివారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టనున్నారు.

పేదలకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ



బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : డీసీసీబీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు కలికి మాధవరెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ రూరల్ బస్టాండు వద్ద పేదలకు, మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. సాయంత్రం కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద మాధవరెడ్డి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, మారంరెడ్డి ముత్యాలరెడ్డి, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



ట్రాఫిక్ నియంత్రణపై సూచనలు చేస్తున్న డీఎస్పీ



దుకాణదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ గోపిని ఆదేశించారు. ఆయన శుక్రవారం సాయంత్రం పాత బస్టాండు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రధాన రహదారి ప్రాంతాల్లో పరిశీలించారు. దుకాణదారులు రోడ్డును ఆక్రమించుకోవడంతోపాటు వాహనాలను నిర్లక్ష్యంగా నిలిపి ఉండడంతో ట్రాఫిక్ స్తంభిస్తున్నట్టు గుర్తించారు. జీఎన్‌టీ రోడ్డు, రహదారి ప్రాంతాల్లో దుకాణదారులను సమావేశ పరిచి వారికి సూచనలు చేశారు. దుకాణాల ముందు వాహనాలను నిలపకుండా చూసుకోవాలన్నారు. రోడ్డు ఆక్రమించుకుని ఏర్పాటుచేసుకున్న దుకాణాలను తొలగించాలని, లేని పక్షంలో ట్రాఫిక్ నిబంధనల మేరకు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోమవారం నుంచి ప్రతిరోజూ ట్రాఫిక్‌పై పర్యవేక్షిస్తామన్నారు.

బాలికల గురుకుల పాఠశాల పరిశీలన



భోజనాన్ని రుచి చూస్తున్న మున్సిపల్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి

నాయుడుపేట టౌన్ : మండలంలోని బిరదవాడ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పడేసి ఉండడాన్ని గమనించి అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. వంటశాల, విద్యార్థుల భోజన శాల తదితర ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. నాణ్యమైన కూరగాయలను వినియోగించాలని తెలిపారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం రోజూ వండే వంటకాలను ప్రతి రోజు పరిశీలించాలని ప్రిన్సిపాల్ రూత్ రమోలను ఆదేశించారు. చెత్త తరలించే వాహనాలను ప్రతి రోజూ గురుకులానికి వచ్చేలా చూడాలని ప్రిన్సిపాల్ కోరారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు



తిక్కవరం చెరువులో గ్రావెల్ తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

చిల్లకూరు : టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నా రు. మండలంలోని తిక్కవరం గ్రామ చెరువులో కట్ట పనులు చేస్తున్నామని చెబుతూ గ్రావెల్‌ను తవ్వి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నా రు. చెరువు కట్ట పని చేస్తున్నట్టు నమ్మించి హిటాచీలను ఉపయోగిస్తూ సుమారు 20 ట్రాక్టర్ల లో గ్రావెల్ తరలిస్తున్నారు. ట్రాక్టర్ రూ.500 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే తొణుకుమాల సమీపంలోని కలవకొండ రెవెన్యూ పరిధిలో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధి అండ ఉండడంతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నట్టు తెలిస్తే రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు ఆయా ప్రాంతాలకు చేరుకుని కేసులు బనాయించేవారు. వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించేవారు. ప్రస్తుతం తిక్కవరంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, పైగా చెరువు కట్ట పని చేస్తున్నారు కదా.. అందుకే అక్కడ తవ్వకాలు చేస్తున్నారని మాట దాట వేస్తున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి అనూష

వెంకటగిరి రూరల్ : విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. పట్టణంలోని శ్రీ ప్రగడ కోటయ్య ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)లో శుక్రవారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ బాలికలు, యువతుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని తెలిపారు. కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ జిత్యానాయక్, న్యాయవాదులు రాజారామ్, రాజేష్, గాంధీ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై ప్రజా వేదిక

కలువాయి: 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధి హామీ కింద చేపట్టిన పనుల సామాజిక తనిఖీ ప్రజా వేదికను శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా 20 పంచాయతీల్లో సుమారు రూ.11 కోట్లతో చేసిన పనులను పరిశీలించినట్టు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో కొలతల్లో తేడాలు ఉన్నాయని, మస్టర్లలో స్థానికంగా లేని వారి పేర్లు నమోదు చేసినట్టు గుర్తించామని వెల్లడించారు. ఈ ప్రజావేదిక శుక్రవారం రాత్రి పొద్దు పోయే వరకు జరుగుతూనే ఉంది. అడిషనల్ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంకా కొన్ని గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నారని, అన్ని వివరాలు వచ్చిన తర్వాత అవకతవకలు జరిగాయా లేదా అన్న విషయం వెల్లడిస్తామని చెప్పారు. సోషల్ ఆడిట్ డైరెక్టర్ జగదీష్ కుమార్, ఎస్‌టీఎం కోనయ్య, ఏపీడీ శంకర్, అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి, ఎస్ఆర్‌పీ నీలకంఠ, ఎంపీడీవో ప్రభాకర్, జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ పి.పెంచలనరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్



కాలిపోతున్న బైక్



చికిత్స పొందుతున్న మధుసూదన్

రాపూరు: మండలంలోని తెగచర్ల సమీపంలో శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొంది. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బైక్ దగ్ధమైంది. పోలీసుల కథనం మేరకు.. దుత్తలూరు గ్రామానికి చెందిన మధుసూదన్ శుక్రవారం పెంచలకోన నరసింహ స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరాడు. తెగచర్ల సమీపంలో ముందు వెళుతున్న కారును ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108లో రాపూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. బైక్‌కు మంటలు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయింది. పోలీసులు కేసును నమోదు చేశారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రాపూరు: ఆధార్ ప్రత్యేక శిబిరాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గంగయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనివారం రాపూరు సచివాలయంలో ఆధార్ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆధార్‌లో కచ్చితమైన వివరాలు ఉండడం ఎంతో ఉపయోగమన్నారు. అక్షర దోషాలు ఉంటే సరిచేసుకోవచ్చని సూచించారు.